క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ నియామకం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీని నియమించారు. ఈ మేరకు తిరుపతికి చెందిన మన్నెం మునిరెడ్డిని రాష్ట్ర ఇంటిలెక్చువల్స్ విభాగం సంయుక్త కార్యదర్శిగా, దివ్యాంగుల విభాగం సంయుక్త కార్యదర్శిగా ఆలూరు సంజీవరాయుడు (ఆలూరు చిన్నా), పబ్లిసిటీ విభాగం కార్యదర్శిగా కట్టా గోపీయాదవ్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

క్షతగాత్రురాలికి హర్షిత్‌రెడ్డి సాయం



గాయపడిన మహిళకు చేయూతనందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చిన్నగొట్టిగల్లు:రక్తగాయాలతో ఆర్తనాదం చేస్తున్న మహిళకు వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సాయం అందించారు. వివరాలు.. భాకరాపేట- ఎర్రావారిపాళెం మార్గంలో దీన్‌దార్లపల్లె వద్ద ఆటోలో వెళుతున్న మహిళ ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. అదే సమయంలో అటు వైపుగా కారులో వస్తున్న హర్షిత్‌రెడ్డి వెంటనే అక్కడ ఆగారు. క్షతగాత్రురాలికి తోడుగా కొందరు నేతలను పెట్టి వేరే వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మానవత్వం చాటుకున్న హర్షిత్‌రెడ్డిని స్థానికులు అభినందించారు.

ఎస్వీయూ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి, గ్రీన్ క్రాప్ సంయుక్తంగా రాష్ట్ర స్థాయిలో జీవ వైవిధ్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మదనపల్లి జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల బీఎస్సీ బయోటెక్నాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని గుణ విజయ మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి పోటీల్లో పద్మావతీ డిగ్రీ కళాశాల బీఎస్సీ జువాలజీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని దీప్తి మొదటి స్థానం పొందారు. గుణ విజయ, దీప్తిని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు, యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్‌చౌదరి అభినందించారు.

అభివృద్ధి లేని అరాచక పాలన

- సూపర్‌సిక్స్ హామీలను విస్మరించారు
- తిరునగరిని మద్యం మాఫియాకు అడ్డాగా మార్చేశారు
- ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



తిరుపతి మంగళం : అధికారంలోకి వస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం కంటే మించి పథకాలు అందిస్తాం.. లక్షల ఉద్యోగాలను ఇస్తాం ..యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తాం.. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు నగదు వేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం..ఏడాదికి నాలుగు ఉచిత సిలిండర్లు అందిస్తాం..రైతులకు రూ.20వేల చొప్పున సాయం చేస్తామంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికి ఏడాదిగా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. సూపర్‌సిక్స్ హామీలను అటకెక్కించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ఆయన 'సాక్షి'తో ఆదివారం ప్రత్యేకంగా మాట్లాడారు.

- కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. మోసపూరిత వాగ్దానాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. రోడ్లపై గోతులను పూడ్చడం తప్ప తిరుపతి నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు.
- తిరుమలను రాజకీయ కేంద్రంగా మార్చేశారు. భువి వైకుంఠాన్ని భ్రష్టు పట్టించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేసినప్పుడే చంద్రబాబుకు పతనం మొదలైంది. తిరుమల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందడం దారుణం. విచ్చలవిడిగా మద్యం, మాంసం విక్రయాలు, ఎర్రచందనం స్మగ్లింగ్, శ్రీవారి ఆలయం వద్ద కొందరు బిరియానీ తినడం, ఆలయంలోకి చెప్పులతో వెళ్లడం, కొండపై ఓ వ్యక్తి నమాజ్ చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీశాయి.
- ఈ ఏడాదిలో కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉన్న వాటినే తీసేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని 3లక్షల మందిని మోసపూరితంగా తొలగించారు. 10వేల మంది ఎండీయూ ఆపరేటర్ల పొట్టకొట్టారు. యువతకు కనీసం నిరుద్యోగ భృతిని కూడా ఇవ్వడం లేదు.
- పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో మద్యం ఏరులై పారుతోంది. నిత్యం గోవింద నామస్మరణలతో మారుమోగాల్సిన ఆధ్యాత్మిక నగరం మందుబాబుల ఆగడాలతో దద్దరిల్లుతోంది. రాత్రింబవళ్లు మద్యం విక్రయాలు సాగుతున్నాయి. తిరుపతి వచ్చిన వారికి మద్యం దుకాణాలే ముందుగా కనిపిస్తున్నాయి.
- ఐదేళ్ల జగనన్న పాలన రామరాజ్యంలా సాగింది. జగనన్న సహకారం, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృషితో నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మించి ఆధ్యాత్మిక నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుంది. సత్యనారాయణపురం నుంచి మున్సిపల్ పార్క్ వైపు మాస్టర్‌ప్లాన్ రోడ్డు చివరిలో మిగిలిపోయిన వందమీటర్లను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది.

గడువు లోపు నిర్మాణాలు పూర్తి కావాలి



హాజరైన హౌసింగ్ అధికారులు

- జూన్ 10నాటికి 14 వేలు లక్ష్యం
- 5,468 ఇళ్లకు అదనపు నిధులు ఇచ్చాం
- గృహ నిర్మాణశాఖ జిల్లా ప్రత్యేక అధికారి అన్నపూర్ణ

తిరుపతి అర్బన్: అందరికీ ఇళ్లు పథకం ద్వారా పేదోళ్లకు అందించిన స్థలాల్లో నిర్మాణాలను ఇచ్చిన గడువు మేరకు పూర్తి చేయాలని హౌసింగ్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, చీఫ్ జనరల్ మేనేజర్ అన్నపూర్ణ తెలిపారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లో హౌసింగ్ అధికారులతో ఇంటి నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10 నాటికి ఇచ్చిన టార్గెట్ 14 వేల ఇళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇంటి నిర్మాణాలకు సంబంధించి 5,468 మందికి అదనపు ఆర్థిక సాయం చేస్తామని గుర్తుచేశారు. వెంటనే వారంతా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. లేదంటే అదనపు నగదుతో పాటు హౌసింగ్ కోసం గతంలో ఇచ్చిన మొత్తాన్ని సైతం రికవరీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా ఇంటిని రద్దు చేస్తామని ఆదేశించారు. హౌసింగ్ అధికారులు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారి దయాకర్‌కు ఆదేశాలిచ్చారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావుతోపాటు మండలాలకు చెందిన హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

చెన్నై- నెల్లూరు మెమో రైలు రద్దు

నాయుడుపేటటౌన్ : చెన్నై నుంచి నెల్లూరుకు సోమవారం ఉదయం వెళ్లే మెమో రైలును రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి శనివారం తెలిపారు. పోన్నేరిలో రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా మెమో రైలును రద్దు చేసినట్లు వెల్లడించారు.

నమాజు వ్యవహారంలో కీలక విషయాలు వెల్లడి

తిరుమల: తిరుమలలోని కల్యాణ వేదికలో ఓ ముస్లిం వ్యక్తి నమాజు చేసిన ఘటనకు సంబంధించి పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడైనట్లు టీటీడీ ఈవో జె. శ్యామలరావు తెలిపారు. శనివారం స్థానిక అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు ఈవో స్పందిస్తూ స్థానిక కల్యాణ వేదికలో ముస్లిం వ్యక్తి నమాజు చేసేలా కొందరు వ్యక్తులు ప్రోత్సహించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందన్నారు. దీనిపై దేవదాయశాఖ చట్టం ప్రకారం నిందితుడిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో స్పష్టం చేశారు.

గురువు పాడె మోసిన భూమన



రఘునాథరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత భవితకు బాటలు వేసేవారు గురువులు. తమ శిష్యులు ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తారు. అలాంటి గురువు పాడెను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మోశారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు రఘునాథరెడ్డి మరణించారన్న విషయాన్ని తెలుసుకున్న భూమన కరుణాకరరెడ్డి హుటాహుటిన తిరుపతి ఆర్డీవో కార్యాలయం సమీపంలోని జయశంకర్‌నగర్‌లో వున్న వారి నివాసానికి చేరుకున్నారు. రఘునాథరెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు జరిగేంతవరకు అక్కడే ఉన్నారు. రఘునాథరెడ్డి పాడెను మోసి రుణం తీర్చుకున్నారు.

డ్రగ్స్ ఉన్నాయంటూ దోపిడీకి యత్నం

- మహిళ మెడలో చైన్ లాక్కెళ్లే ప్రయత్నం



చంద్రగిరి పోలీసు స్టేషన్

చంద్రగిరి: 'కారులో డ్రగ్స్ తరలిస్తున్నట్లు సమాచారం అందింది. మీ కారుని తనిఖీ చేయాలి' అంటూ దుండగులు మహిళ మెడలో నుంచి బంగారు చైన్ లాక్కెళ్లేందుకు యత్నించిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం చిత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న ఓ కారు మండల పరిధిలోని పనపాకం సమీపంలోని టోల్‌ప్లాజా దాటుకుని ముందుకు వస్తోంది. కారును వెంబడించిన ముగ్గురు వ్యక్తులు టోల్‌ప్లాజా దాటగానే కారుకు అడ్డంగా ద్విచక్ర వాహనాన్ని ఉంచి కారుని ఆపారు. ఆపై తాము టోల్‌ప్లాజా సిబ్బంది అని, మీ కారులో అక్రమంగా డ్రగ్స్‌ను రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. కారులో తనిఖీలు చేపట్టాలని హంగామా చేశారు. ఈ క్రమంలో కారులో ఉన్న మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కుని పారిపోవడానికి యత్నించడంతో, ప్రయాణికులు కేకలు వేశారు. దీంతో ఒక వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా, సహకరించిన మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లో పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి పెనుమూరు మండలం, బొంతవంక గ్రామానికి చెందిన లోకేష్‌గా గుర్తించారు. అనంతరం పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. విచారణ చేపట్టామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ప్రేమోన్మాదంతోనే హత్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాపూరు : మండలంలోని తాతిపల్లె శివారులో ఈ నెల 16వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం ఈ మేరకు రాపూరు సర్కిల్ కార్యాలయంలో డీఎస్సీ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఆమె తండ్రి షేక్ షఫీ(50)ని ప్రధాన నిందితుడు సంగ్రపల్లి మస్తాన్ పథకం ప్రకారం మరో ఆరుగురితో కలిసి హత్య చేసినట్లు తెలిపారు. షఫీ కుమార్తెను మస్తాన్ ప్రేమించేవాడని, ఆమెకు వివాహం నిశ్చయమైందని తెలియడంతో సహించలేకపోయాడని చెప్పారు. ఈ క్రమంలోనే షఫీని చంపేయాలని తన స్నేహితులు దాసరి క్రాంతి(గూడూరు), సుదర్శన్ సన్ని (నెల్లూరు రూరల్), రాజశేఖర్ (బిట్రగుంట), సాయిప్రకాష్ (తిప్పగుంటపాళెం చిల్లకూరు మండలం), మలపాటి వెంకటసాయి (నెల్లూరు), తరుణ్ (నెల్లూరు మూలాపేట)తో కలిసి పథకం రూపొందించినట్లు వివరించారు. ఈమేరకు అద్దె కారు తీసుకుని షఫీ నిర్వహించే కూల్‌డ్రింక్ షాపు వద్ద రెక్కీ చేశారన్నారు. 16వతేదీ రాత్రి షఫీ ఇంటికి వెళుతుండగా బలవంతంగా కారులోకి ఎక్కించుకుని రాపూరు మండలం తాతిపల్లె శివారుకు తీసుకెళ్లి కత్తులతో నరికి చంపినట్లు తెలిపారు. అనంతరం నిందితులు కారులో పరారైనట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, కండలేరు ఎస్ఐ రామకృష్ణ, రాపూరు ఎస్ఐ రాజేష్, సైదాపురం ఎస్ఐ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో అభివృద్ధి



ప్రాజెక్ట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు

తిరుపతి అర్బన్ : పరిశ్రమల స్థాపనతో తిరుపతిని అభివృద్ధి పథంలో నడిపించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో సీఐఐ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి పథంలో స్వర్ణ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, సీఐఐ తిరుపతి చైర్మన్ జగన్నాథ్ అనిరుధ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో 'ఒక కుటుంబం, ఒక వ్యవస్థాపకుడు' అనే ప్రధాన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్థిక స్వావలంబన, ఆవిష్కరణ, ఉద్యోగ సృష్టికి సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని తెలిపారు. సూక్ష్మ పరిశ్రమలకు సైతం ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐఐ రాష్ట్ర వైస్ చైర్మన్ నరేంద్ర కుమార్, మాజీ చైర్మన్ విజయ్ నాయుడు గల్లా, తిరుపతి వైస్ చైర్మన్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

మీజిల్స్, రుబెల్లాపై స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్

తిరుపతి తుడా : మీజిల్స్, రుబెల్లాపై స్పెషల్ డ్రైవ్‌ను జూలై వరకు వరకు 3 విడతలుగా నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మీజిల్స్, రుబెల్లా అత్యంత ప్రమాదకరమైన అంటువ్యాధులన్నారు. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ కింద మీజిల్స్, రుబెల్లా బారిన పడకుండాపిల్లలకు 2 డోసుల వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందులో మొదటి డోసు 9–12 నెలల వయసులో, రెండో డోసు 16 నుంచి 24 నెలల వయసులో ఉంటుందని వివరించారు. మొదటి రౌండ్ సోమవారం నుంచి నెల 31 వరకు, రెండో రౌండ్ జూన్ 23 నుంచి 28వరకు, మూడో రౌండ్ జూలై 21 నుంచి 26వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.

ఆర్‌ఐల నియామకంలో ఆమ్యామ్యాలు

- వివాదాస్పదంగా తిరుపతి కార్పొరేషన్‌లో ఆర్‌ఐల నియామకం
- ఏసీబీకి పట్టుబడిన వ్యక్తి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన మరొకరికి అవకాశం
- కమిషనర్ ఆదేశాలను తుంగలో తొక్కి పని కానిచ్చిన ఓ అధికారి

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)ల నియామకం వివాదాస్పదంగా మారింది. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య శనివారం రాత్రి తొమ్మిది మందితో కూడిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఇదివరకు ఆర్‌ఐలుగా పనిచేసిన వారిలో ఒక్కరినీ కొనసాగించలేదు. ఆ మేరకు జాబితాలో పేర్లు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఆర్‌ఐగా ఎక్కువ కాలం పని చేసిన ఇద్దరికి మాత్రం మరోసారి అవకాశం కల్పించడం వివాదాస్పదంగా మారింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించి మూడుసార్లు సస్పెండ్ అయిన ఒకరికి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కాలంలో ఏసీబీకి పట్టుబడిన మరొకరికి అవకాశం కల్పించడం పట్ల మున్సిపల్ కార్పొరేషన్ వర్గాల్లో విస్మయం వ్యక్తం అవుతోంది. అలానే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా నియమించిన వారిలో నలుగురికి కనీసం ఫైల్ చదవగలిగే సామర్థ్యం లేదని, ఇంగ్లిషుపై పూర్తిగా పరిజ్ఞానం లేని, ఏదైనా అవసరం ఉన్నప్పుడు నోటీసులు జారీ చేసే సామర్థ్యం లేని వారిని అందలం ఎక్కించారని మరో వర్గం భగ్గుమంటోంది.

అంతా ఆయన కనుసన్నుల్లోనే..

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నియామకంలో కమిషనర్ మౌర్య నిష్పక్షపాతంగా, సామాజిక న్యాయం పాటిస్తూ కొత్తవారికి అవకాశం కల్పించాలని భావించారు. ఈ క్రమంలో కమిషనర్‌కు అనేక ఒత్తిళ్లు వచ్చినా వాటిని పట్టించుకోకుండా నియామకాలు చేపట్టాలని భావించారు. ఈ బాధ్యతను ఇద్దరు అధికారులకు అప్పగించారు. రెవెన్యూ సెక్షన్‌లో అంతా తానై వ్యవహరిస్తున్న రెవెన్యూ ఆఫీసర్ వ్యవహార శైలిపై అనుమానం రావడంతో ఓ అధికారి పక్కకు తప్పుకున్నట్లు తెలుస్తోంది. దీంతో మరో అధికారి అంతా తానై వ్యవహరించి జాబితాను సిద్ధం చేసి కమిషనర్ ముందు ఉంచారు. ఆ అధికారిని నమ్మి కమిషనర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నియామక జాబితా ఆధారంగా 'నీకు పోస్ట్ వేయిస్తున్నాను' అని సదరు అధికారి బేరసారాలకు దిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కో ఆర్‌ఐ నుంచి రూ.2 లక్షల వరకు ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్లు కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయాలన్నీ కమిషనర్‌కు తెలియకుండా ఆ అధికారి జాగ్రత్తలు తీసుకోవడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల జాబితా నిష్పక్షపాతంగా జరిగిందని ఆమె భావిస్తున్నారు. అందుకు విరుద్ధంగా జాబితా ఉండడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది మంది ఆర్‌ఐలలో ఐదుగురి నియామకం వివాదాస్పదంగా మారడంతో కమిషనర్‌కు కొత్త తలనొప్పి మొదలైంది.


విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి : విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు సమగ్రశిక్ష జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం శ్రీకాళహస్తి మండలం టీజీపీఓ కాలనీలోని ఏపీటీడబ్ల్యూ ఆర్‌ఎస్ గేల్స్ పీఎం శ్రీ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆటిజం సెంటర్‌కు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: రాస్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇంటర్నేషనల్ ఆర్థిక సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ కార్యక్రమాల పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. శనివారం కలెక్టరేట్‌లో రాస్ ప్రతినిధుల నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పథకాలపై అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఏ సహకారం తీసుకోవాలని సూచించారు. రాస్ ప్రతినిధులు వెంకటరత్నం, రమేష్ రెడ్డి, నాగరాజు, నాగేంద్ర శర్మ పాల్గొన్నారు.

పులి.. కాదు శునకమే!



పులి జన సంచారంలోకి వస్తే ఎలా ఉంటుంది ? ఏంటి పులి బైక్‌పై వెళుతుందా అనే సందేహం వస్తోందా ? అయితే ఆగండి.. పులి చారలు వేసిన కుక్కను ఓ వ్యక్తి బైక్‌పై తీసుకెళుతుండగా శనివారం తిరుపతి నగరంలో సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్లుప్తంగా

నివాళి



ఈశ్వరమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం బత్తినవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రవీంద్రనాథ్ రెడ్డి తల్లి మేకల ఈశ్వరమ్మ ఈనెల14వ తేదీన మరణించారు. అనంతరం 24వ తేదీన శనివారం జరిగిన దశదిన కర్మక్రియలకు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరయ్యారు. ఈశ్వరమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన ప్రతి నేత, కార్యకర్తలను వారు పలకరించారు. కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్‌తో పాటు పలువురు నేతలు ఉన్నారు.

ఐక్యతతో పనిచేద్దాం



సమావేశమైన తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అభివృద్ధికి అందరూ ఐక్యతతో పనిచేద్దామని తుడా చైర్మన్ డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం తుడా ఉపాధ్యక్షుడు మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులు తదితరాలను ఉపాధ్యక్షులు మౌర్య వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, ఉద్యానవన శాఖాధికారి మాలతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పోదార్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రేపాక కుర్మారావు

తిరుపతి అర్బన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు సాధించారని ప్రిన్సిపల్ రేపాక కూర్మారావు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం మార్గంలోని తమ స్కూల్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 2025 మొదటి బ్యాచ్‌లోనే తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. 1927లో పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనందలాల్ స్కూల్‌ను ముంబైలో మొదటగా స్థాపించగా, తాము తిరుపతిలో 2019లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం డాక్టర్ పవన్ పోదార్ చైర్మన్‌గా ఉన్నారని, దేశవ్యాప్తంగా 271 విద్యాసంస్థలు కొనసాగుతున్నాయని వివరించారు.

ఏకుదారం పుస్తకావిష్కరణ



పుస్తక ఆవిష్కరణలో రచయితలు, కవులు

తిరుపతి రూరల్ : కాలానుగుణంగా సమాజానికి ఏమీ అవసరమో దాన్ని సాహిత్యం తీర్చుతుందని ప్రముఖ కథ, నవల, నాటక రచయిత డాక్టర్ వీఆర్ రాసాని అన్నారు. తిరుపతిలోని స్థానిక యూత్ హాస్టల్లో అనంతపురం జిల్లా వాసి డాక్టర్ నాగేషు రచించిన 'ఏకుదారం' పుస్తక ఆవిష్కరణ శనివారం జరిగింది. పుస్తకాన్ని ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆచార్య వీసీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించగా తొలి ప్రతిని రచయిత ఆర్‌సీ కృష్ణస్వామి రాజు అందుకున్నారు. అనంతరం రాసాని, పుస్తకావిష్కరణకర్త ఆచార్య వీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నవల్లో రచయిత నాడీ స్పందన ప్రతి అక్షరంలో కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాషిణి, బొమ్మిశెట్టి రమేష్, పీలేరు డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, రచయితలు పలువురు సాహితీమిత్రులు, కవులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: తాము కొనుగోలు చేసి అనుభవంలో ఉన్న భూమిని దౌర్జన్యం చేసి కబ్జాకు పాల్పడిన వారిపై అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితురాలు ఆర్.సంపూర్ణమ్మ విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 1981లో సుబ్రమణ్యంరాజు వద్ద నుంచి ఉపాధ్యాయ నగర్‌లో పన్నెండున్నర సెంట్ల భూమిని రిజిస్టర్ చేసుకున్నట్లు చెప్పారు. ఈనెల 22న ఏకంగా 30 మందిని వెంటబెట్టుకుని హేమహెప్సిబా, జోలిహెలీనా, లానా విండ్య అనే వారు వచ్చి తమ స్థలంలో నిర్మించుకున్న రెండు షెడ్లను ధ్వంసం చేశారన్నారు. ఆ సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని, పైగా తన అల్లుడు సుకుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైలు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దౌర్జన్యకారులపై చర్యలు తీసుకుని వారి నుంచి తమకు ప్రాణరక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

తృష్ణ.. శిక్షణ.. సాధన

వేసవి సెలవులను పలువురు యువత తమ అభిరుచులకు అనుగుణంగా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రధానంగా స్పోర్ట్స్‌కు ప్రాధాన్యత ఇచ్చి వేసవి శిబిరాలలో చేరుతూ తమకు ఇష్టమైన ఆటల్లో శిక్షణ పొందుతున్నారు. మరికొందరు తల్లిదండ్రులను పోరు పెట్టి సైకిల్ కొనుగోలు చేసి నేర్చుకునేందుకు ఖాళీ స్థలాలు, స్కూళ్లు, కాలేజీ గ్రౌండ్స్‌లో సైకిళ్లతో కుస్తీ పడుతున్నారు. మరోవైపు 18 ఏళ్లు నిండిన యూజీ, పీజీ విద్యార్థులు డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్నారు.

- డ్రైవింగ్, సైక్లింగ్ నేర్చుకుంటున్న యువతరం
- టూవీలర్, ఫోర్‌వీలర్ శిక్షణలో డిగ్రీ, పీజీ విద్యార్థులు
- సెలవులు కావడంతో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు బిజీబిజీ
- డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఇదే సరైన సమయం అంటున్న యువత
- గ్రౌండ్‌లు, ఖాళీ స్థలాల్లో శిక్షణ ఇస్తున్న పలువురు డ్రైవింగ్ స్కూల్స్ నిర్వాహకులు

తిరుపతి సిటీ: విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కొందరు విద్యార్థులు భవిష్యత్‌లో అవసరమయ్యే వాటిపై శిక్షణ పొందడానికి ఇష్టపడుతున్నారు. నిత్యకృత్యమైన జీవితంలో ప్రతి మనిషికి వాహనం అవసరం. అయితే డ్రైవింగ్ ప్రధానం.



సైక్లింగ్‌తో ఆరోగ్యం..

గతంలో సైకిల్ నేర్చుకోవాలంటే పట్టణాల్లో ఇబ్బడి ముబ్బడిగా సైకిల్ షాపులు ఉండేవి. గంటల ప్రాతిపదికన బాడుగకు దొరికేవి. దీంతో ప్రతిరోజు రూ.20 ఉంటే చాలు నాలుగు గంటలపాటు సమీపంలోని గ్రౌండ్‌కు తీసుకెళ్లి నేర్చుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సైకిల్ నేర్చుకోవాలంటే కొత్తది కొనాల్సిందే. ప్రస్తుతం సెలవులు కావడంతో బాలబాలికలు తల్లితండ్రులను ఒత్తిడి చేసి కొత్త సైకిల్‌ను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో కొత్త కొత్త మోడల్ సైకిల్స్ అందుబాటులోకి వచ్చాయి.

అందుకే వేసవి సెలవులను వృథా చేసుకోకుండా పలువురు విద్యార్థులు, యువత టూవీలర్, ఫోర్‌వీలర్ డ్రైవింగ్ స్కిల్స్‌పై దృష్టి సారించారు.

డ్రైవింగ్ శిక్షణలో యూజీ, పీజీ విద్యార్థులు

యూజీ, పీజీ విద్యార్థులు వేసవి సెలవులు రావడంతో వాటిని సక్రమంగా వినియోగించుకుంటున్నారు. జీవితంలో ప్రధాన భూమిక పోషించే డ్రైవింగ్ శిక్షణలో బిజీబిజీగా గడుపుతున్నారు. విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా టూవీలర్ శిక్షణా కేంద్రాలు తిరుపతిలో అందుబాటులోకి వచ్చాయి. అలాగే పదుల సంఖ్యలో ఫోర్‌వీలర్ డ్రైవింగ్ స్కూల్స్ నగరంలో ఉన్నాయి. 18 ఏళ్లు పైబడి ఎల్ఎల్ఆర్ పాసైన వారు డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందేందుకు అర్హులు. దీంతో యువత సెలవుల్లో డ్రైవింగ్ నేర్చుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

డాడీ కొత్త సైకిల్ కొనిచ్చారు



మాది తిరుపతి చెన్నారెడ్డి కాలనీ. సెలవులు కావడంతో సైకిల్ నేర్చుకోవాలని డాడీని అడిగాం. వెంటనే కొత్త సైకిల్ కొనుగోలు చేసి రెండు రోజుల పాటు నేర్పించారు. ఇప్పుడు మేమే ఇంటి నుంచి గ్రౌండ్ వరకు సైకిల్‌లోనే వస్తున్నాం. ప్రధాన రోడ్లలో తిరిగాలంటే మరింత నేర్చుకోవాలి. సైకిల్‌పై మరింత పట్టుకోసం గ్రౌండ్‌లో రౌండ్స్ వేస్తున్నాం. ఈ ఏడాది సెలవుల్లో సైకిల్ నేర్చుకున్నాం. చాలా హ్యాపీగా ఉంది. – విశ్వాస్, జాన్సన్ విద్యార్థులు, తిరుపతి

డ్రైవింగ్ నేర్చుకోవాలని..



నేను ఎంబీబీఎస్ చేస్తున్నా. 18 ఏళ్లు నిండడంతో ఎల్ఎల్ఆర్ పరీక్ష రాసి పాసయ్యాను. టూవీలర్ స్కూటీ నేర్చుకునేందుకు ట్రైనర్ సుజాత ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నా. ఎస్వీయూలోని రోడ్లలో ట్రాఫిక్ లేకపోవడంతో ఇక్కడ నేర్చుకుంటున్నా. చదువుతో పాటు డ్రైవింగ్ అనేది జీవితంలో కీలకమైంది. స్కూటీ పూర్తిస్థాయిలో నేర్చుకున్నాక టూవీలర్ కొనుగోలు చేసి కాలేజీకి వెళ్తాను.

– బుష్రా, ట్రైనర్ సహాయంతో స్కూటీ నేర్చుకుంటున్న మెడిసిన్ విద్యార్థిని, తిరుపతి

సెలవుల కోసం ఎదురు చూస్తున్నా..



నేను డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. ఏడాది నుంచి వేసవి సెలవుల కోసం ఎదురు చూస్తున్నా. ఈ ఏడాది తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎలాగైనా టూవీలర్ డ్రైవింగ్ నేర్చుకోవాలని ఫిక్స్ అయ్యాను. ఇంట్లోవాళ్లు నేర్పిస్తే అంత తొందరగా నేర్చుకోలేం. ప్రత్యేక ట్రైనర్ సహాయంతో స్కూటీ నేర్చుకుంటున్నా.

– తేజ, ట్రైనర్ సహాయంతో డ్రైవింగ్ నేర్చుకుంటున్న డిగ్రీ విద్యార్థిని, తిరుపతి

డ్రైవింగ్ ప్రాధాన్యతను గుర్తించి



నేను ఇంజినీరింగ్ చదువుతున్నా. ఇప్పటికే టూవీలర్ నేర్చుకున్నా. ఎల్ఎల్ఆర్ తీసుకున్నాను. ప్రస్తుతం సెలవులు రావడంతో ఎలాగైనా ఫోర్‌వీలర్ డ్రైవింగ్ నేర్చుకుని లైసెన్స్ పొందాలని డిసైడ్ అయ్యా. దీంతో కేటీ రోడ్డులోని డ్రైవింగ్ స్కూల్‌లో చేరా. ప్రతి రోజు గంట సమయం అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు పట్టు సాధించా.

– సాయిలలిత్, ఫోర్‌వీలర్ నేర్చుకుంటున్న బీటెక్ విద్యార్థి, తిరుపతి

గతేడాది టూవీలర్..ఈసారి ఫోర్‌వీలర్



చదువుతో పాటు టూవీలర్, ఫోర్‌వీలర్ డ్రైవింగ్ కచ్చితంగా అవసరం. బీటెక్ పూర్తి చేశా. గత ఏడాది వేసవి సెలవుల్లో స్కూటీ నేర్చుకుని టూవీలర్ డ్రైవింగ్ లైసెన్స్ పొందాను. ఈసారి కారు నేర్చుకుంటున్నా. నెలరోజుల పాటు శిక్షణ తీసుకుని ఫోర్‌వీలర్ లైసెన్స్ తీసుకుంటా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డ్రైవింగ్ స్కూల్‌లో చేరాను.

– ప్రజ్ఞశ్రీ, కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న విద్యార్థిని, తిరుపతి

రాయలసీమపై పాలకుల నిర్లక్ష్యం



బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: రాయలసీమ పట్ల నిర్లక్ష్యం, వివక్ష, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్న ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు సంగమేశ్వరం వద్ద చేపట్టే భారీ బహిరంగ సభకు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘాల సమాఖ్య నేత మాంగాటి గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిం,చి ప్రసంగించారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని, అందరి ప్రదేశ్ అనే విషయాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. అమరావతి, పోలవరం పాట పాడుతూ ఇతర ప్రాంతాల మనోభావాలను కించపరుస్తోందని విమర్శించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా, ప్రాంతీయ సమతుల్య విధానాలతో ఈ ఏడాది 80 లక్షల ఎకరాల ఆయకట్టుకు సరిపడే కృష్ణా జలాలు సముద్రం పాలయ్యాయన్నారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా సంగమేశ్వరంలో పెద్దఎత్తున బహిరంగ సభ చేపడుతున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రజలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నేతలు శివశంకర్‌రాజు, మల్లికార్జున్ రెడ్డి, ప్రహ్లాదరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ అధికారుల స్పందన



ఎగ్జామినేషన్ విభాగంలో నాసిరకం ఫర్నీచర్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో మౌలిక సదుపాయాల కల్పన, ఎగ్జామినేషన్ సెక్షన్‌లో నాసిరకం ఫర్నీచర్ ఏర్పాటుపై శుక్రవారం 'ఎస్వీయూలో వసతులు లేక వెతలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వర్సిటీ అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం ఎగ్జామినేషన్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫర్నీచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫర్నీచర్ ఏర్పాటుపై ప్రత్యేక కమిటీని నియమించాలని ఉద్యోగులు అధికారులను కోరారు. పరిశీలించి మిగిలిన ఎస్టాబ్లిస్‌మెంట్ సెక్షన్లలో నాణ్యత గల ఫర్నీచర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఉద్యోగులకు రిజిస్ట్రార్, జాయింట్ రిజిస్ట్రార్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

హోరాహోరీగా సీపీఎల్

– బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తున్న క్రికెటర్లు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న శశాంక్ శ్రీనివాస్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న హర్షారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రంజీ, ఏపీ, జాతీయ స్థాయి క్రికెటర్లు ఈ పోటీల్లో తమ సత్తా చాటుతున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన ఇస్తున్నారు. కొందరు క్రికెటర్లు ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకుంటున్నారు.

రాయల్ చాలెంజ్, హైపీరియన్ జట్లు విజయం

శనివారం నిర్వహించిన రెండు మ్యాచుల్లో రాయల్ చాలెంజ్, హైపీరియన్ జట్లు విజయం సాధించాయి. ఉదయం రాయల్ చాలెంజ్ తిరుచానూరు, ఆదిత్య లెవెన్స్ జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య లెవెన్స్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 172పరుగులు చేసింది. అభిషేక్ 57 బంతులో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 91 పరుగులు చేశాడు. 173 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్టు 18.1 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 175 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ శశాంక్ శ్రీనివాస్ కేవలం 19 బంతుల్లో 5 సిక్సులు, 5 ఫోర్లతో 56 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించడంతో పాటు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందుకున్నాడు. మరో ఓపెనర్ కెప్టెన్ జ్ఞానేశ్వర్ 46బంతుల్లో 10 ఫోర్లతో 56 పరుగులు చేశాడు. వీరివురు అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టు విజయంలో కీలకమయ్యారు. అలాగే మధ్యాహ్నం హైపీరియన్, స్పోర్టర్ వారియర్స్ జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన స్పోర్టర్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. మీనా రాహుల్ 42, మనోజ్ సాయి 41 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో మహమ్మద్, సయ్యద్ అఖిల్ చెరో రెండు వికెట్లు సాధించారు. 172 పరుగుల లక్ష్యచేధనతో బరిలోకి దిగిన హైపీరియన్ జట్టు కేవలం 15.5 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి సునాయాసంగా విజయాన్ని అందుకుంది. తేజరెడ్డి 25 బంతుల్లో 40, హర్షరెడ్డి 29 బంతుల్లో 54 పరుగులతో రాణించారు. హర్షారెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందుకున్నాడు. వీరికి బహుమతులను సీడీసీఏ అధ్యక్షుడు విజయకుమార్, ఉపాధ్యక్షుడు మురళి, మెడిగో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాజిత్ దంపతులు అందించారు.

శ్రీవారి సేవలో సంస్కరణలు

- టీటీడీ ఈవో శ్యామలరావు
- డయల్ యువర్ ఈవోలో భక్తుల ప్రశ్నలకు సమాధానాలు



మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు

తిరుమల: శ్రీవారి సేవలో పలు సంస్కరణలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. ఆయన శనివారం తిరుమల అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

- ప్రశ్న : లడ్డూ సేవను 65 ఏళ్లు దాటిన వారికి ఇవ్వండి. పరకామణి సేవలో పాల్గొన్నవారికి ప్రతిరోజూ దర్శనం కల్పిస్తే బాగుంటుంది?

ఈవో : పరకామణి సేవ చేసిన వారికి ప్రతిరోజూ దర్శనం కల్పించడం సాధ్యంకాదు. లడ్డూ సేవను గతంలో ప్రయత్నించినప్పటికీ సరైన ఫలితాలు రానందున ఆపేశాం.

- ప్రశ్న : జూలైలో దర్శనాలకు అదనపు కోటా విడుదల చేసే అవకాశం ఉందా?

ఈవో : ఆన్‌లైన్‌లో అదనపు కోటా విడుదల చేసే అవకాశంలేదు. కరెంటు బుకింగ్‌లో మాత్రమే దర్శన టోకెన్లు అందుబాటులో ఉంటాయి.

- ప్రశ్న : సీనియర్ సిటిజన్ దర్శనాల్లో సహాయకులుగా మరొకరిని పంపించేందుకు వీలవుతుందా?

ఈవో : అలాంటి అవకాశం ఉండదు. సీనియర్ సిటిజన్లకు సహాయం అందించేందుకు శ్రీవారి సేవకులు అందుబాటులో ఉంటారు.

- ప్రశ్న : గతంలో తిరుమలలో సీఆర్వోలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో గదుల కేటాయింపు కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం సీఆర్వోలో మాత్రమే గదులు ఇస్తుండడం భక్తులు ఇబ్బంది పడుతున్నారు?

ఈవో : ఇతర ప్రాంతాల్లో గదుల కేటాయింపు వల్ల పలు సమస్యలు వస్తున్నాయని సీఆర్వోకే పరిమితం చేశాం. దీనిపై భక్తుల నుంచి మంచి స్పందన వస్తోంది.

- ప్రశ్న : శ్రీవారి దర్శనానికి పారామిలిటరీ దళాలకు ప్రత్యేక అవకాశం కల్పించండి?

ఈవో : ఇప్పటికే ఆర్మ్‌డు ఫోర్స్‌కు ఈ అవకాశం ఉంది. కోటా పెంచడం సాధ్యం కాదు. ఆర్మ్‌డు ఫోర్స్ కోటాలోనే ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం.

- ప్రశ్న: అఖిలాండం వద్ద చిరు వ్యాపారుల వద్ద భద్రతా సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు?

ఈవో : వివరాలు తెలియజేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ప్రశ్న : సర్వ దర్శనానికి వస్తున్న దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. వారికి ప్రత్యేక దర్శన సదుపాయం ఉందా?

ఈవో : ఇప్పటికే రోజుకు 750 టోకెన్లు జారీ చేస్తున్నాం. భక్తుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించలేం.

- ప్రశ్న : సీనియర్ సిటిజన్లకు వమో భారం దృష్ట్యా ఆలయానికి దగ్గరగా వసతి గదులు కేటాయింపు, అన్నప్రసాద కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది?

ఈవో : గదుల కేటాయింపు విషయంలో మీ సూచనను పరిశీలిస్తాం.

- ప్రశ్న : టీటీడీ నేత్రదాన ట్రస్టు ఏర్పాటు చేస్తే ఎంతో మంది భక్తులకు మేలు జరుగుతుంది?

ఈవో : ఈ అంశంపై ఇప్పటికే అరవింద్ కంటి ఆస్పత్రితో చర్చలు జరుపుతున్నాం. త్వరలో విధివిధానాలు ప్రకటిస్తాం.

- ప్రశ్న : శ్రీవారి మెట్టు వద్ద నడకదారిన వచ్చే భక్తులందరికీ టోకెన్లు ఇవ్వండి?

ఈవో : ఇప్పటికే రోజుకు 3 నుంచి 4 వేల వరకు టోకెన్లు జారీ చేస్తున్నాం. ఆ సంఖ్యను పెంచితే సర్వ దర్శన భక్తులకు ఇబ్బంది కలుగుతుంది.

- ప్రశ్న : శ్రీనివాస మంగాపురంలో వేద ఆశీర్వచనాన్ని ఏక బ్రాహ్మణుడే ఇస్తున్నాడు?

ఈవో : ఈ అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

తిరుపతి కల్చరల్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సుతో పాటు ఇంటర్వ్యూ స్కిల్స్, వంటి నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9000487423ను సంప్రదించాలన్నారు.